క్లుప్తంగా

విగ్రాం రామాగౌడ్ సేవలు చిరస్మరణీయం



రామాగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): విగ్రాం రామాగౌడ్ సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విగ్రాం వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతా పారిశ్రామిక సంస్థ మాజీ చైర్మన్ దివంగత విగ్రాం రామాగౌడ్ రెండో వర్ధంతి సందర్భంగా ఆదివారం పెద్దశంకరంపేటలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా రాజకీయ జీవితంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమనీ పేర్కొన్నారు. వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగిన నేతగా రామాగౌడ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి రమేశ్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, గంగాధర్, సురేశ్, సాయిరెడ్డి, అనిల్, సూర్య ప్రకాష్, రజినీకాంత్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో గాలి అనిల్ కుమార్



దుర్గమ్మను దర్శించుకుంటున్న అనిల్ కుమార్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గామాతను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు గాలి అనిల్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రాలతో ఆయనను ఆశీర్వదించారు. వెంట కొల్చారం మండల బీఆర్ఎస్ నాయకులు నాయిని వెంకట్‌గౌడ్, నర్సింగ్‌రావు, పుల్లబోయిన దుర్గేశ్, ధన్‌రాజ్, మల్లేశం, నర్సింలు, నవీన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా జగదాంబ సేవాలాల్ వారోత్సవం

నిజాంపేట(మెదక్): గ్రామాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని మెదక్ మాజీ ఎమ్మెల్యే హనుమంత రావు అన్నారు. మండలం పరిధిలోని శౌకత్‌పల్లి గ్రామంలో జగదాంబ సేవాలాల్ వారోత్సవాల్లో భాగంగా హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగదాంబ సేవాలాల్ రెండవ వారోత్సవాలకు హాజరవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారుతీ, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేశ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



మంత్రి దామోదరతో కాంగ్రెస్ శ్రేణులు

రేగోడ్(మెదక్): మండలంలోని ప్యారారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు, తెలంగాణ ఉద్యమకారులు మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం సంగారెడ్డిలోని ఆయన నివాసంలో కలిశారు. జయరావ్, ప్రవీణ్, దేవరాజ్, పవులు, రాజారావు, సామేల్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఉర్సు



దర్గా వద్ద పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లిలో ఉర్సు ఆదివారం ముగిశాయి. ఓం ఫాజిల్ నగర్ అప్పగారి ఆశ్రమ 42వ సంవత్సర ఆరాధన ఉత్సవాల సందర్భంగా గంధారాధన, గంధలేపనం, దీపారాధన, ఖవ్వాలి, పుష్పాలంకరణ, వేదాంతహారతి, ఖురాన్ పఠనం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు నర్సింలు చిష్తి తెలిపారు.

పేకాట ఆడుతున్న వారిపై కేసు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముప్పారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. ముప్పారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, వినోద్, విజయ్, అంజయ్య, బీరప్పలు పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకొని దాడి చేసి, పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వారి వద్ద రూ.16,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



లక్ష్మీనర్సింహస్వామి



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతోపాటు పలువురు తలనీలాలు సమర్పించారు. అలాగే వాహనాలను పూజలు చేశారు. డప్పు చప్పుడు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కనుల పండువగా జరుగుతోంది. అందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని వంటావార్పు చేశారు. పవిత్ర కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జాతర ఏర్పాట్లలో ఈఓ శశిధర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యారెడ్డి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, ఉన్నారు.

ఘనంగా దుర్గామాత ఉత్సవాలు

శివంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో దుర్గామాత ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం జాతర సందర్భంగా అమ్మవారికి అర్చకులు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఊరేగింపు, పోతురాజుల ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు పాడి, పంటలతో సంతోషంగా ఉండాలని దుర్గామాతను వేడుకున్నట్లు చెప్పారు. జాతరలో నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, చింతల కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ హరికృష్ణ, సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ దశరథ్, వివిధ పార్టీల నాయకులు నవీన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగరావు, నారాయణరావు, భిక్షపతిరావు, గణేశ్, పాపయ్యచారి, ప్రహ్లాద్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మనోహరాబాద్(తూప్రాన్): బంగారమ్మ ఆలయం వద్ద..



రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భక్త జనులతో బంగారమ్మ

మనోహరాబాద్(తూప్రాన్): కాలకంఠి బంగారమ్మ ఆలయ ప్రాంగణం భక్త జనులతో నిండిపోయింది. పలు గ్రామాలకు చెందిన భక్తులు మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆపై అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యంలతో తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణ పరిసరాల్లో వనభోజనాలు చేశారు. ఆలయం వద్ద అర్చకుడు వేణుగోపాల్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కనులపండువగా చిత్తారమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు



మైనంపల్లిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని చిత్తారమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఉదయం అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించి ఒడిబియ్యం పోశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మైనంపల్లి హామీ ఇచ్చారు. ఆయన వెంట పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా కోఆర్డినేటర్ విప్లవ్‌కుమార్, జిల్లా నాయకులు పండరిగౌడ్, శ్రీధర్‌రెడ్డి, కిషన్, పట్టణ కార్యదర్శి అల్లాడి వెంకటేశ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తార్యానాయక్, ఆలయ కమిటీ ప్రతినిధులు మర్కు దత్తు, సిద్ధరాంలు, దోమకొండ యాదగిరి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఈఓ ప్రోటోకాల్ పాటించడం లేదు'

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాల్లో ఈఓ శశిధర్ ప్రోటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, కుంట లక్ష్మణ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మూడు నెలల పాటు జరిగే జాతర సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీతో పాటు మండల స్థాయి ప్రజాప్రతినిధుల కూడిన ఫొటోలతో బ్యానర్లు ఏర్పాటు చేయక పోవడంపై వారు తప్పుపట్టారు. ఈ విషయమై ఈఓపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

క్రీడలతో మానసికోలాసం



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): క్రీడలతో మానసికోలాసం చేకూరుతుందని, తద్వారా శారీరకంగా ఎదిగేందుకు క్రీడలు దోహదపడతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రంగంపేట మధిర గ్రామం సదాశివనగరంలో యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్, రంగంపేట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దుర్గేశ్, యాదయ్య, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



తెలంగాణతల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంగమేశ్వరశాస్త్రి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మల్లుపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని విగ్రహదాత పురోహితుడు సంగమేశ్వరశాస్త్రి, సర్పంచ్ లక్ష్మి ఆవిష్కరించారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి

నిజాంపేట(మెదక్): దివ్యాంగుల సమస్యలను పరిష్కారించాలని మెదక్ జిల్లా ఎన్‌పీఆర్డీ ఉపాధ్యక్షుడు మాందాపురం గౌతమ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా పెరుగుదలకు అనుగుణంగా సంక్షేమ పథకాల్లో 12 శాతం దివ్యాంగులకు కేటాయించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని అన్నారు. బస్సులు, రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999 – 2000 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. 24 సంవత్సరాల తర్వాత అందరం కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని నింపడమే గురువుల కర్తవ్యం అని గుర్తు చేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన గురువులు, స్వర్గీయులు రమణయ్య, గండె మల్లేశం, విద్యార్థి చంద్రారెడ్డిని తలుచుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, వెంకటేశం, ఎండీ గౌస్, మనోహర్ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె కరపత్రం ఆవిష్కరణ

మెదక్ కలెక్టరేట్: ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో జరిగిన గ్రామ పంచాయతీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆల్ ట్రేడ్ యూనియన్, ఉద్యోగ సంఘాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పేరుతో దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ బంధు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న కార్మిక రంగం నిర్వహిస్తున్న సమ్మెలో జిల్లాలోని గ్రామ పంచాయతీ సిబ్బంది అందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయితీ జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారావు నాయకులు నర్సింలు, పద్మ, రాములు, శంకర్, ఎల్లం, మాణిక్యం, పోచయ్య పాల్గొన్నారు.

పంచాయితీలతో రోగులకు పరేషాన్



ఆస్పత్రి గేటు వద్దే పంచాయితీ నిర్వహిస్తున్న ఇరువర్గాలు (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగానే ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. అయితే ఏదేని కేసు నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారంతా ఎదురుగా ఉన్న ఆస్పత్రి ఆవరణలోనే గంటల తరబడి పంచాయితీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలోకి రావాలంటే రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. దీనికితోడు పంచాయితీలో ఒకరికొకరు పెద్ద ఎత్తున దూషించుకోవడంతో ఆస్పత్రిలో సిబ్బందితో పాటు రోగులు అవస్థలు పడుతున్నారు. ఒక్కో రోజు రెండు నుంచి మూడు పంచాయతీలు కొనసాగడం వల్ల ఆస్పత్రిలో వైద్యం చేసుకోవడానికి రావాలంటే మహిళలు జంకుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు హెచ్చరించినా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోగులు అవస్థలు పడకుండా చూడాలని వేడుకుంటున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కేసులు

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతీ రోజు ద్విచక్ర వాహనదారులు రోడ్లపై అతివేగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అల్లాదుర్గం పోలీసులు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి, వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. 161 జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయడంతోనే ప్రమాదా లు చోటు చేసుకొని నిండు ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు.

రేగోడ్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ రాజయ్య హెచ్చరించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోజూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, పోలీసుల సూచనలు పట్టించుకోవడం లేదని తెలిపారు. నంబర్ లేని వాహనాలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని, నంబర్ లేని వాహనాలు పట్టుకొని కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రోడ్డుపై వాహనాలు నడిపే ముందు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవని సూచించారు.

ఆలయ వార్షికోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలో వెలిసిన శీతలమాత (నల్లపోచమ్మ) ఆలయ 8వ వార్షికోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈనెల 31న బుధవారం ఉదయం గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, లక్ష పుష్పార్చన, సాయంత్రం అమ్మవారి విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు. ఫిబ్రవరి 1న గురువారం చండీయాగం, సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహిస్తారు. శుక్రవారం దేవత పూజ, మహా నైవేద్యంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. మూడు రోజుల పాటు నిరంతరం అన్నదానం ఉంటుందని చెప్పారు. సమయానుకూలంగా భక్తి భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

మంజీర తీరం.. భక్త జన సంద్రం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆదివారం భక్త జనసందోహంగా మారింది. అర్చకుడు పార్థివశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. దుర్గమ్మ తల్లిని రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ జగపతి దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, బోనాలుతీసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమ ఫలాలకు ఆదరణ



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

తూప్రాన్: కాంగ్రెస్ పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా అధ్య

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

క్షుడు నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భగవన్‌రెడ్డితో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, వట్టూరు సర్పంచ్ మాణెమ్మలతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన సుమారు 50 మంది నాయకులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సురేశ్, మహిందర్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం బ్రాహ్మణ వివాహ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రోజాశర్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిచయ వేదికలో 250 మంది తమ పేర్లన నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో బల్వంతరావు, అమిత్‌దేశ్‌పాండే, అశోక్‌రావు, రాధాకృష్ణశర్మ, శ్రీనివాస్‌రావు, రాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నర్సింగ్ ఆఫీసర్‌గా అఖిల**



మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ స్టేట్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఫలితాల్లో జోన్ 3 ఓపెన్ కేటగిరిలో నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్‌నర్స్)గా మండల కేంద్రానికి చెందిన ఇమాంపురం వెంకటేశ్‌గౌడ్, విజయ దంపతుల కూతురు అఖిల ఆదివారం నియామకమయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

◆ **సన్మానం**



చేగుంట(తూప్రాన్): తెలంగాణ రాష్ట్ర బీజేపీ సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌తివారీని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఇటీవల బీజేపీ అధిష్ఠానం రాష్ట్ర బీజేపీ సంఘటన కార్యదర్శిగా నియమిస్తూ చంద్రశేఖర్‌కు బాధ్యతలను అప్పగించారు. హైదరాబాద్‌లో చంద్రశేఖర్‌ను సన్మానించారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన రాజకీయ అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

◆ **కరాటేలో ఆరు బంగారు పతకాలు**

చిన్నశంకరంపేట(మెదక్): హైదారాబాద్ ఎల్‌బీ నగర్‌లో నిర్వహించిన చోటకన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ 2024 పోటీల్లో మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు ఆరు బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులు అంజలి, నిహారిక, రేణుక, ప్రసన్న, కృతిక, నీరజ, దీపిక తేజశ్రీ పోటీల్లో పాల్గొని ఆరు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం, ఒక రజిత పతకం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం పుష్పవేణి, కరాటే ట్రైనర్ కిషన్ తెలిపారు. మెచ్ఎం, ట్రైనర్‌ను గ్రామస్తులు అభినందించారు.



తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని 6వ వార్డులోని మదర్స పాఠశాల వద్ద నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయముద్దీన్‌తో కలిసి బోరు మోటార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని 15 వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యంగౌడ్, నయీమ్, లయక్ అలీఖాన్, ముజాహిద్ ఖాన్, మైనార్టీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.